సైబర్ టార్చర్
ఫోన్ వేధింపులు
ఒకేరోజు ఐదు చోట్ల చోరీలు -5



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
సోమవారం 27 జనవరి 2025



'మా అక్షరం - మీ ఆయుధం'

నినాదంతో ప్రజల పక్షాన గొంతుకై అక్షర సమరం సాగిస్తోంది మీ అభిమాన పత్రిక ఆంధ్రజ్యోతి.

అభాగ్యులకు, అశక్తులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి దశాబ్దాలుగా అక్షర శరాలు సంధిస్తూ అలుపెరగని పోరాటం సాగిస్తోంది.

అవినీతి, అక్రమాలపై నిరంతరం యుద్ధం చేస్తూనే.. సమాజ ఉనికికి ప్రమాదకరంగా మారిన అరాచక శక్తులపై అక్షర కణాలతో కడిగేస్తూనే వుంది.



తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరీక్షించే ప్రజల గొంతుకై ప్రతిధ్వనించడానికి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' మీ ముంగిటకు రానున్నాం.

సమస్యలను ఎత్తిచూపడంతోపాటు వాటి పరిష్కార దిశగా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అధికారులకు నడుమ వారధిగా నిలిచే మహత్తర కార్యక్రమానికి మంగళవారం నుంచి శ్రీకారం చుడుతున్నాం.

తాడేపల్లిగూడెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఏపీ నిట్ వరకు వీధి దీపాలు లేవు. ఇదే ప్రాంతంలోని పార్కు నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారుతోంది.

నూజివీడులో చాలా కాలంగా డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు సరిగా పారడం లేదు.

ఈ సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయా ప్రాంతాల్లో చర్చా వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. వీటిని వారి దృష్టికి తెచ్చేందుకు ఈ చర్చల్లో పాల్గొనాలని ఈ ప్రాంతాల ప్రజలను ఆహ్వానిస్తున్నాం.



భారతదేశ ప్రజాస్వామ్యాన్ని ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పాలకొల్లులో తన కార్యాలయంలో ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేశారు..



ప్రగతికి పునరంకితం



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, ఎస్పీ నయీం అస్మీ

జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుదాం
రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ఉద్యానశాఖలో చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు చేయూత
ఆక్వా రంగానికి ఆసరా
గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నాగరాణి



మొదటి బహుమతి అందుకున్న తణుకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

భీమవరం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, రాష్ట్ర, దేశ ప్రగతికి ప్రజలందరం పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన సాధించడానికి అహర్నిశలు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక, మానవాభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉంచేందుకు శ్రమిస్తామని తెలిపారు. భీమవరం కలెక్టరేట్ వద్ద ఆదివారం 76వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నాగరాణి జెండా వందనం నిర్వహించారు. వేడుకలు అట్టహాసంగా సాగాయి. ముందుగా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసి తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి స్వరాజ్య యజ్ఞంలో ప్రాణాలర్పించిన త్యాగధనులు జాతిపిత మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ లాంటి ఎందరో దేశ భక్తులను మరువకూడదన్నారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు కారుమూరి బాపిరాజు, బొప్పన సుబ్బయ్య, శీలి రామారావు, ఆకెళ్ళ పార్థ సారధి వంటి ఎందరో మహానుభావులు చిరస్మరణీయులు. జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, తిలక్, రాజాజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి ఎందరో గొప్ప గొప్ప దార్శనికులకు భారతదేశం పుట్టినిల్లయ్యిందంటూ కలెక్టర్ వారందరికీ నివాళులర్పించారు.

రైతు సంక్షేమానికి వెన్నుదన్ను

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది. రైతులకు వెన్నుదన్నుగా ఉంటుంది. సకాలంలో రైతులకు సొమ్ములను జమ చేస్తోంది. ధాన్యం కొనుగోళ్లను సులభతరం చేసింది. ప్రభుత్వ పనితీరుతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఏడాది వంద శాతం ఈ క్రాప్ నమోదు చేసినట్టు గుర్తు చేశారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాల కల్పన వంటివి రైతులకు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. రైతులు ఎదుర్కొనే ప్రతీ సమస్యకు రైతు సేవా కేంద్రాలలో పరిష్కారం లభించేలా చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ లో రైతులనుంచి 4.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసామన్నారు. . పంటల పై చీడ పీడలను గుర్తించుటకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుటను ప్రోత్సాహిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఉద్యానవన శాఖకు ప్రోత్సాహం

ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా ఉద్యాన పంటల సాగు ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా 25 హెక్టార్లలో 70 మంది రైతులతో హైబ్రిడ్ కూరగాయ వంగడాల సాగుకు ప్రోత్సహిస్తున్నామని వివరించారు. అలాగే జాతీయ ఆయిల్ పామ్ మిషన్ ద్వారా 356 హెక్టార్లలో పాలీహౌస్ ద్వారా కాప్సికం, ఆర్కిడ్స్ వంటి ఉత్పత్తులపై దృష్టిపెట్టినట్టు తెలిపారు.చిన్న తరహా ఆహార పరిశ్రమలను ప్రోత్సహించేందుకు జిల్లాలో 59 యూనిట్‌లు మంజూరు చేసినట్టు చెప్పారు. పశుజాతిని పెంపొందించేందుకు కృత్రిమ గర్భధారణను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటిదాకా 96,489 పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేసి 39,374 మేలు జాతి దూడలను ఉత్పత్తి చేసినట్టు వివరించారు.

ఆక్వా రంగానికి చేయూత

జిల్లాలో ఆక్వారంగం మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 16.94 కి.మీ సముద్ర తీర ప్రాంత పరిధిలో 43,776 హెక్టార్ల విస్తీర్ణంలో ఆక్వా సాగు జరుగుతోంది. చేపలు, రొయ్యలు ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాం. మత్స్యకార సహకార సంఘాలకు రాయితీలు కల్పించినట్టు కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, శాసన మండలి సభ్యులు బొర్రా గోపి మూర్తి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఏఎస్పీ భీమారావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దేశ భక్తిని, జాతీయ భావాన్ని రగిల్చేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తిని చాటుతూ చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందానికి ప్రథమ బహుమతి, పాలకొల్లు భారతీయ విద్యా భవన్ విద్యార్థుల బృందానికి ద్వితీయ బహుమతి, భీమవరం పీఎస్ఎమ్ గర్ల్స్ మున్సిపల్ హైస్కూల్ తృతీయ బహుమతి గెలుచుకున్నాయి.

అవార్డులు పొందిన అధికారులు



కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్, ఎస్పీ నయీం అస్మి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరసాపురం ఆర్డీవో దాసిరాజు .. అవార్డులు అందుకుంటున్న అధికారులు వరుసగా..



కె.రామచంద్రారెడ్డి , భీమవరం మునిసిపల్ కమిషనర్



జెడ్. వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయాధికారి



డాక్టర్ డి.మురళీ కృష్ణ , పశు సంవర్ధకశాఖ



టి.శివరామప్రసాద్, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్



ఎస్.సరోజ, జిల్లా సివిల్ సప్లయ్స్ ఆఫీసర్



ఎం.నాగరాజు , జిల్లాకో-ఆపరేటివ్ ఆఫీసర్



టి.రామ్‌కుమార్, తణుకు మునిసిపల్ కమిషనర్



బి.అరుణశ్రీ,జిల్లా పంచాయతీ అధికారిణి



టి.నాగేశ్వరరావు, డీపీఆర్వో



వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ



డాక్టర్ అప్పారావు, డ్వామా ప్రాజెక్టు డైరక్టర్



బీవీవీ నాగేశ్వర రావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ



కుమరేశ్వరన్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ



టి.ఉమామహేశ్వర రావు,రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్



ఆదారి గణేష్, ట్రెజరీ డిప్యూటీ డైరక్టర్



వి.సుజాత రాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరక్టర్



ఎల్.వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్



డాక్టర్ పి.సూర్యనారాయణ, జీవీవీ జిల్లా కో-ఆర్డినేటర్



వి.భీమారావు, అడిషనల్ ఎస్పీ





ఆకట్టుకున్న స్టాల్స్

వివిధ శాఖలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఉద్దేశిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయశాఖ, ఉద్యాన వన శాఖ, మహిళా అభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, అగ్నిమాపక శాఖ, మెప్మా, జిల్లా గ్రామ పంచాయతీ శాఖ, ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, పరిశ్రమల శాఖ, అటవీ శాఖ, చేనేత జౌళి శాఖలు మొత్తం 18 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ , ఎస్పీ , జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్ని స్టాల్స్‌ను సందర్శించారు.



స్టాల్స్ ఏర్పాటులో ప్రతిభ కనబరచిన స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రథమ బహుమతిని, మత్స్యశాఖ ద్వితీయ బహుమతిని, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ తృతీయ బహుమతిని గెలుపొందాయి. కవాతు ప్రదర్శనలో కడగట్ల గురుకుల పాఠశాల విద్యార్థులు స్కాట్లాండ్ బ్యాగ్ పైప్ బ్యాండ్ బృందం ప్రదర్శనకు ప్రత్యేక అవార్డు అందుకున్నారు.కలెక్టరేట్‌లో ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపథ్యంలో వేడుకల్లో ఆహుతులకు, తిలకించేందకు వచ్చినవారికి స్టీల్ వాటర్ బాటిల్స్ , స్టీలు గ్లాసుల ద్వారా మంచి నీరు అందించారు.



లేగ దూడతో జేసీ



బ్యాండ్ ట్రూప్ వందన సమర్పణ

అభివృద్ధిని ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన

పలు శాఖలు తమ ప్రగతిని ప్రతిబింబించేలా ప్రదర్శించిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యాశాఖకు ప్రథమ బహుమతి, వ్యవసాయ శాఖకు ద్వితీయ బహుమతి, పశుసంవర్ధక శాఖ తృతీయ బహుమతిని అందుకున్నాయి. పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన జంతు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకుల కరతాళ ధ్వనులను అందుకుంది. విద్యా, వైద్య ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, విద్యుత్ శాఖ, విద్య శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, ఉద్యానవన శాఖ, అగ్నిమాపక శాఖ, వ్యవసాయ శాఖలు అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రదర్శిస్తూ శకటాలను ఏర్పాటు చేశాయి.

మొదటి బహుమతి సాధించిన విద్యాశాఖ శకటం



జాబితా వడబోత

ఈ ఏడాది నుంచి వేట నిషేధ భృతి రూ.20 వేలకు పెంపు
పాత లబ్ధిదారుల సంఖ్య 1,772
అనర్హుల్ని గుర్తించి ఏరివేతకు చర్యలు


నరసాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వైసీపీ సానుభూతిపరులకు ప్రభుత్వ పథకాల్లో పెద్దపీట వేశారు. అనర్హులకు కూడా దొడ్డిదారుల్లో లబ్ధి చేకూర్చారు.లేని వైకల్యం ఉన్నట్లు దొంగ సర్టిఫికెట్లు జారీ చేయించి పింఛన్లు మంజూరు చేయించారు. ఇలా అన్ని పథకాల్లో అవినీతి చోటు చేసుకుందని భావించిన కూటమి ప్రభుత్వం పాత జాబితాల్లోని లబ్ధిదారుల వడబోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా ఈ ఏడాది నుంచి వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచారు.ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,772 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఎంతమంది అర్హులు అన్నదానిపై అధికారులు ఆరా తీసే పనిలో పడ్డారు. దానిలో భాగంగా గుర్తింపు పొందిన బోట్ల యాజమానులకు బోట్లపై పనిచేస్తున్న మత్స్యకారుల వివరాలను అందించాలని లిఖితపూర్వకంగా వర్తమానం పంపుతున్నారు.

బోటు యజమానుల నుంచి సమాచారం..

జిల్లాలో నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్ల మేర సముద్రతీరం విస్తరించింది. మూడు రకాల బోట్లపై మత్స్యకారులు సముద్రంపై వేట సాగిస్తుంటారు. వాటిలో కంట్రీ మేడ్ (పెద్ద ఇంజన్ నాటు పడవపై)ముగ్గురు, ఇంజన్ బోట్లు అంటే ఫైబర్‌బోటుపై ఆరుగురు, సోనా బోటుపై ఎనిమిది మంది కలిసి సముద్ర వేట సాగిస్తారు. ప్రతి ఏటా కేంద్రం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేటనిషేధ ఆజ్ఞలు అమలు చేస్తుంది. ఈ సమయంలో మత్స్యకారులకు ఉపాధి ఉండదు. ఈ రెండు నెలల కాలంలో ఇప్పటివరకు గుర్తింపు కార్డులు ఉన్న మత్స్యకారులకు నెలకు రూ.5వేలు చొప్పున రెండు నెలలకు రూ.10 వేలు భృతిని అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం అధికారుల లెక్కల్లో 1,772 మంది ఉన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఈ భృతిని రూ.10 నుంచి రూ20 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి దాన్ని ఇటీవల ఆమోదించారు. గతంలో మాదిరిగా కాకుండా మే నెల చివరిలోనే ఈ భృతిని మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న జాబితాలో అంతా అర్హులేనా లేక అనర్హులకు చోటు కల్పించారా ? అన్న విషయాన్ని ఆరా తీయాలని మత్స్యశాఖను ఆదేశించింది. దానిలో భాగంగా జిల్లా అధికారులు ఇప్పటి వరకు ఏఏ బోట్లపై మత్స్యకారులు భృతి పొందుతున్నారో.. ఆ యజమానుల నుంచి మళ్లీ జాబితాను తెప్పించుకుంటున్నారు. దీన్ని పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేయనుంది. ఈ విషయంపై జిల్లా మత్స్యశాఖ జేడీ ప్రసాద్‌ను వివరణ కోరగా జాబితాలోని అర్హుల్ని గుర్తించేందుకు ముందుగా బోటు యాజమానుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాం. దాని ఆధారంగా అర్హుల్ని గుర్తించి తుది జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.



1న చంద్రబాబు రాక



తేతలిలో పర్యటన
ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేత
అదేరోజు పేదలకు ఇళ్లు పంపిణీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు వస్తున్నారు. తణుకు నియోజకవర్గం తేతలిలో చంద్రబాబు పర్యటన ఉంటుంది. అధికారికంగా ఖరారు చేశారు. సమయం షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను పరిశీలించారు. తేతలిలో అనువుగా ఉంటుందని తేల్చారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఈసారి తణుకులో ముఖ్యమంత్రి చంద్ర బాబు అందజేస్తారు. లబ్ధిదారుల ఇంటికి వెళతారు. అందుకే ఫిబ్రవరి ఒకటో తేదీన ముఖ్యమంత్రి పర్యటనను ఖరారు చేశారు. అదే రోజున ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0లో పూర్తయిన ఇళ్లను ప్రారంభిస్తారు. లబ్ధిదారులకు అందజేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 3159 ఇళ్లను అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ సొమ్మును విడుదల చేస్తారు. తేతలిలో పేదల ఇళ్ల కాలనీ పూర్తయ్యింది. దానిని ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రారం భించనున్నారు. తణుకు నియోకవర్గానికి చెందిన దాదాపు 2 వేల మంది లబ్ధిదారులతో తేతలి లోనే సమావేశం కానున్నారు. సమస్యలు అడిగి తెలుసుకుంటారు. ఎంపిక చేసిన వారినే చంద్రబాబు సభకు అనుమతించనున్నారు. తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వస్తుండడంతో జిల్లా నేతలంతా అప్రమత్తమయ్యారు. చంద్ర బాబు సభకు వెళ్లేలా ప్రణాళికలు చేసుకుంటున్నారు. అయితే ముఖ్యులు మాత్రమే ముఖ్యమంత్రిని కలిసే అవకాశం ఉంది. ప్రభుత్వం కార్యక్రమం కావడంత కేడర్‌తో భేటీ అయ్యే అవకాశం ఉండదని తెలుస్తోంది. కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

భీమవరంలో 'సంక్రాంతి' సందడి

భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర విజయోత్సవ సభ జరిగింది. హీరో వెంకటేశ్, హీరోయిన్స్ ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి, డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిత్ర బృందం పాల్గొన్నారు. గోదారి గట్టు..పాటకు డాన్స్ వేయడంతో పాటు 'బేసికల్లీ' సాంగ్‌ను వెంకటేశ్ పాడి అలరించారు. -4లో..




ఏలూరులో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన


సీఆర్ రెడ్డి పాఠశాల విద్యార్థుల విన్యాసం

గణతంత్ర వేడుక సాంస్కృతిక సందడి

ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్, భీమవరం కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థిని, విద్యార్థుల నృత్య, నాటక ప్రదర్శనలు, జాతీయ స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి నింపే విన్యాసాలు, ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.




ఏలూరులో సెయింట్ థెరిసా కళాశాల విద్యార్థినుల ప్రదర్శన


భీమవరంలో గణతంత్ర వేడుకల్లో విద్యార్థుల పల్లె నృత్యం




ఏలూరు విద్యార్థుల రోప్ స్కిప్పింగ్ విన్యాసం


గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న కలిదిండి విద్యార్థుల విన్యాసం




తణుకు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన




మహిళలపై వేధింపులు అంశంపై ఏలూరు కస్తూరిబా పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



శకట విజయం






ఏలూరు జిల్లాలో ద్వితీయ బహుమతి పొందిన విద్యుత్ శాఖ, తృతీయ బహుమతి పొందిన ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ శకటాలు




పశ్చిమగోదావరి జిల్లాలో ద్వితీయ బహుమతి పొందిన వ్యవసాయ శాఖ, తృతీయ బహుమతి పొందిన పశు సంవర్ధక శాఖ శకటాలు

సాంస్కృతిక విజయం




ఏలూరు జిల్లాలో ద్వితీయ బహుమతి పొందిన గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, సెయింట్ థెరిసా మహిళా కళాశాల విద్యార్థినుల ప్రదర్శనలు




పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన పాలకొల్లు విద్యా భవన్, భీమవరం పీఎస్ఎం పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు

రాజ్యాంగం ద్వారానే సమాన హక్కు: ఐజీ అశోక్‌కుమార్








జిల్లా కోర్టు ఆవరణ, నిట్, ఉద్యాన యూనివర్సిటీ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ, జెండా వందనం చేస్తున్న ఐజీ అశోక్ కుమార్


డీసీసీబీ ఆవరణలో జాతీయ పతాకానికి వందనం

ఏలూరు క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కు సంక్రమించిందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. రేంజ్ కార్యాలయం వద్ద ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జెండావందనం చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా ఉద్యోగ నిర్వహణ, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో..

ఏలూరు జిల్లా కోర్టుపై జాతీయ పతాకాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. డాక్టర్ డీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో న్యాయవాదులు విశేష కృషి చేయాలని, తద్వారా సమాజ అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. న్యాయాధికారులు పి.మంగాకుమారి, జి.రాజేశ్వరి, ఎం.ఉమా సునంద, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్ ఆవరణలో..

తాడేపల్లిగూడెం అర్బన్: భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పతనమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిట్ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, డాక్టర్ కార్తిక్ శేషాద్రి, డాక్టర్ వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీ కార్యాలయం వద్ద..

ఏలూరు: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం వద్ద డీసీసీబీ సీఈవో నారా ఎంఎస్ఆర్‌జి తిలక్ జాతీయ జెండా ఆవిష్కరించారు. సిబ్బంది స్వీట్లు పంచిపెట్టారు. జీఎం మాధవి, డీజీఎం డీఎన్‌వి సత్యనారాయణ, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయంలో..

ఏలూరు సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని జడ్పీ సీఈవో కేఎస్ఎస్.సుబ్బారావు ఎగురవేశారు. కార్యాలయ ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప కులపతి డాక్టర్ కె.గోపాల్ జాతీయ జెండా ఆవిష్కరించారు. మాండ్లెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సౌజన్యంతో ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు రూ.13 లక్షల చెక్‌ను వీసీ గోపాల్ విద్యార్థులకు అందించారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, ఉద్యాన ఉన్నతాధికారులు ఎల్ నారం నాయుడు, ఎం మాధవి, తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన బీఎం హరిబాబు

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

పెంటపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అలంపురంలోని ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు జాతీయ పతాకం ఆవిష్కరించారు. కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో సంక్రాంతి సందడి


సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్ మీట్‌లో హీరో వెంకటేష్, హీరోయిన్లు ఐశ్వర్య, మీనాక్షి సందడి

గోదారోళ్ల అప్యాయత మరువలేనిది

- సక్సెస్ మీట్‌లో హీరో వెంకటేష్

భీమవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గోదారోళ్ల అప్యాయత, కల్మషం లేని నవ్వు ఎన్నటికి మరవలేను.. సంక్రాంతికి వస్తున్నాం ఇంత పెద్ద హిట్ ఇస్తారని అసలు అనుకోలేదని హీరో వెంకటేష్ అన్నారు. ప్రేక్షకులు చిన్న హగ్ ఇస్తారనుకుంటే గాఢంగా గుండెలకు హత్తుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా విజయవంతం కావడంతో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం వేడుక నిర్వహించారు. సినిమా చూసిన ఎవరైనా సరే తమ ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్ గురించి భార్యకు చెప్పడానికి భయపడతారని వెంటేష్ అన్నారు. హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి యువతను ఉత్సాహపరిచారు. హలో భీమవరం ఐ లవ్ యూ... స్టుడెంట్స్‌ను చూస్తుంటే తమ కాలేజీ డేస్ గుర్తుకు వస్తున్నాయన్నారు. అనంతరం వెంకటేష్ గోదారి గట్టు పాటకు డాన్స్ చేశారు. బేసికల్ పాట పాడి అందరిని అలరించారు. సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఇంత పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులను జీవితాంత రుణపడి ఉంటాను అంటు బుల్లిరాజుతో డైలాగ్ చెప్పించి అందరిని నవ్వించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే అంజిబాబు, మంతెనరామరాజు, తదితరులు మాట్లాడారు. యంకర్‌లుగా రవి, గీత, సింగర్స్ శ్రీకృష్ణ, రఘురామ్, మధుప్రియ పాటలతో అలరించారు.


వేదికపై వెంకటేష్, అనిల్ రావిపూడి, బుల్లిరాజు సందడి


పాట పాడి ఉత్సాహపరిచిన హీరో వెంకటేష్, హీరోయిన్లు


జెస్సిరాజ్‌ను అభినందిస్తున్న గవర్నర్ నజీర్

జెస్సిరాజ్‌కు గవర్నర్ ప్రశంస

దెందులూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్కేటింగ్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించి ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము నుంచి ప్రధానమంత్రి బాల పురస్కారం అందుకున్న జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు జెస్సిరాజ్‌ను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సత్కరించారు. విజయవాడలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జెస్సిరాజ్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. ప్రపంచ ఓషియాన పసిఫిక్ కప్ చాంపియన్ షిప్ -2024లో బంగారు పతకం సాధించిన జెస్సీ ప్రధానమంత్రి రాష్ట్రీయబాల పురస్కార్ అందుకుంది.

మావుళ్లమ్మ ఆలయానికి
పది గ్రాముల బంగారం అందజేత


మావుళ్లమ్మ ఆలయానికి బంగారం అందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ అమ్మవారి ఆలయానికి భీమవరానికి చెందిన కలిదిండి వెంకట దిలీప్ కుమార్ వర్మ 10 గ్రాముల బంగారం విరాళంగా అందించారు. దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు మద్దిరాల రమణ శర్మ వీరికి పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటాన్ని అందించారు.

హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ పూజలు


ఐశ్వర్య రాజేశ్‌కు ప్రసాదం, చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

భీమవరం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ అమ్మవారిని 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర హీరోయిన్ ఐశ్వర్యరాజేశ్ ఆదివారంనాడు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమె అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున .ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.



ఖజానా ఉద్యోగుల సంఘ కార్యవర్గం

ఏలూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):ఖజానాశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన యు.వి పాండురంగారావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఏలూరు ఖజానాశాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఇటీవల ఈ అసోసియేషన్‌కు సంబంధించి కార్యవర్గం ఏర్పాటుకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఆదివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు, విత్‌డ్రా కార్యక్రమం జరిగింది. ఆయా పదవులకు సంబంధించి ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు ప్రకటించారు. అధ్యక్షుడిగా యు.వి పాండురంగారావు, అసోసియేట్ అధ్యక్షుడిగా మధుసూధన్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా రమాకిరణ్మయ్, ఉపాధ్యక్షులుగా హరిబాబు, ఏ.శ్రీనివాసరావు, రాజేష్‌కుమార్, కార్యదర్శిగా కె.సత్యనారాయణ, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా వరలక్ష్మి, నరసింహారావు, విద్యాసాగర్, ట్రెజరర్‌గా ఎల్.వెంకటేష్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా నియామకపత్రాలను అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యుడు ప్రమాణస్వీకారం చేశారు. కార్యవర్గాన్ని ట్రెజరీ ఉద్యోగులు అభినందించారు. నూతన అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడుతూ ఖజానాశాఖలో సిఎఫ్ఎంఎస్‌కు సంబంధించి, ఇతర సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎన్నికల పరిశీలకులుగా రమణారెడ్డి, బి.సతీష్ వ్యవహరించారు. జేఏసీ అసిస్టెంట్ కార్యదర్శి జనరల్ ఆర్.ఎస్ హరినాథ్,ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.వి రామారావు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

డ్రాయింగ్, పెయింటింగ్‌లో నాగలక్ష్మికి రాష్ట్రస్థాయి బహుమతి


సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు చేతులు మీదుగా సర్టిఫికెట్, బహుమతి తీసుకున్న కలవల కుసుమ

ఆకివీడు రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సిద్దాపురం దామోదరం సంజీవయ్య జడ్పీపాఠశాల విద్యార్థిని కలవల కుసుమ నాగలక్ష్మి డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. విజయవాడ పడమటలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు చేతులు మీదుగా ప్రశంసాపత్రం, షీల్డ్, రూ. 5వేల నగదు అందుకున్నది. విద్యాశాఖ ని ర్వహించిన వీరగాథ కార్యక్ర మంలో భాగంగా తాను వేసి న డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లను తన పాఠశాల నుంచి ఉపాధ్యాయురాలు వీరగాథ యాప్‌లో సబ్‌మిట్ చేశారని 8వ తరగతి చదువుతున్న కుసుమ తెలిపింది. తనకు చిన్న ప్పటినుంచి డ్రాయింగ్ పెయి ంటింగ్ పట్ల ఆసక్తితో ఖాళీ సమయాలలో బొమ్మలు వేస్తానని తెలిపింది. తన తల్లిదండ్రులతో కలిసి ఈ బహుమతి తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

ఇద్దరూ హెల్మెట్ ధరించాల్సిందే


హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ వైవి రమణ, ఎస్ఐలు రామకృష్ణ, నాగ కల్యాణి

ఏలూరు క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రాణం ఎంతో విలువైందని వాహనాలు నడిపేటప్పుడు ప్రాణ రక్షణకోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ అన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం దగ్గర పలువురు ద్విచక్ర వాహనదారులకు ఆదివారం రాత్రి హెల్మెట్ ధారణపై అవగాహనను సీఐ రమణ, ఎస్ఐలు రామకృష్ణ, నాగ కల్యాణి కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో తలకు దెబ్బతగలడం వల్లే మృతి చెందుతున్నారని వారి కుటుంబాలు ఎంతో ఆవేదనకు గురై చిన్నా భిన్నంగా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలకు దెబ్బతగలదని ప్రాణాలు కాపాడుకోవచ్చునని అన్నారు. మోటారు వాహన చట్టంపై అవగాహన కలిగిస్తూ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మొగల్తూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు బీఆర్ఎంవీ హైస్కూల్‌లో 1981లో పదవ తరగతి చదివిన విద్యార్థుల బృందం ఆదివారం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద సమావేశమయ్యారు. ఈ బ్యాచ్ కుటుంబ సమేతంగా పాల్గొని ఒకరి నొకరు మంచి చెడులు తెలుసుకున్నారు. కరోనా సమయంలో ఈ బ్యాచ్ ద్వారా చేసిన కార్యక్రమాలను చర్చించుకుని భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలను తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆబ్యాచ్ సంఘ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి కె.వి సాంబశివ రావు, ఏలూరు డీఈ తోట వెంకట నారాయణ, సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, పెన్మత్స శ్రీనివాసరాజులతో పాటు సుమారు 100 మంది ఆబ్యాచ్ పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

సైబర్ టార్చర్..



» క్రెడిట్ కార్డ్ అంటూ వివరాలు సేకరిస్తారు » మీ పేరుతో రుణం ఇచ్చామంటూ బెదిరింపులు » ఫోన్ కట్‌చేస్తే పదేపదే విసిగింపు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గతంలో కరోనా నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు కాలర్ ట్యూన్‌గా పెట్టే జాగ్రత్తల స్థానంలో మళ్ళీ సైబర్ నేరాలపై ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. జాగ్రత్తగా ఉండండి. సైబర్ నేరాల అదుపుకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నా సైబర్ నేరగాళ్ల రోజుకో కొత్త పంథా అవలంబిస్తున్నారు. కొన్నాళ్లు ఓటీపీలు అంటూ మోసగిస్తే తరువాత ఆన్‌లైన్ ఆఫర్స్ అంటూ ప్రజలను ఇబ్బంది పెట్టారు. ఇంకాస్త ముందుకెళ్ళి ఈసారి ప్రజల ఫోన్ హ్యాక్ చేయడం, క్రెడిట్ కార్డు అంటూ వల వేసి సొమ్ములు దోచేయడం చేస్తున్నారు. ఇంకాస్త అప్రమత్తంగా ఉన్నవారిపై బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాజాగా తాడేపల్లిగూడెంలో ఈ ఫేక్ కాల్ వల్ల ఓ వ్యక్తి ఆందోళనకు గురై ఆసుపత్రి పాలయ్యాడు.

కాల్ సెంటర్: హలో మేం క్రెడిట్ కార్డ్స్ నుంచి ఫోన్ చేస్తున్నాం. మీకు వ్యక్తిగతంగా రూ. 4లక్షల లిమిట్‌తో క్రెడిట్ కార్డు ఆఫర్ వచ్చింది.

రమేష్: హలో మాకు క్రెడిట్ కార్డు వద్దు.

కాల్ సెంటర్: లేదు సార్.. మీకు మంచి ఆఫర్ వచ్చింది. ఎలాంటి సర్వీస్ ట్యాక్స్‌లు లేకుండా ఉచితంగానే ఈ క్రెడిట్ కార్డు అందిస్తున్నాం.

రమేష్: మాకే ఎందుకు ఈ ఆఫర్ వచ్చింది.

కాల్ సెంటర్: లేదు సార్ మీ బ్యాంకు లావాదేవీలు ఆధారంగా ఈ క్రెడిట్ కార్డు అందిస్తున్నాం.

రమేష్: అయితే మా వివరాలు నోట్ చేసుకోండి.

కాల్ సెంటర్: అన్ని వివరాలు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబరు, పాన్ కార్డ్ తోపాటు వ్యక్తిగత వివరాలు అడుగుతారు. చివరికి క్రెడిట్ కార్డు నుంచి క్లియరెన్స్ కోసం ఓ మెసేజ్ వస్తుంది. అందుల్లో ఓటీపీ చెప్పండి చాలు.

రమేష్: బాబోయ్ ఓటీపీ చెప్పడం కుదరదు.

కాల్ సెంటర్: లేదు సార్ లేదంటే మీరే ఆ లింక్ క్లిక్ చేసి మీరే వివరాలు నమోదు చేసుకోండి, సరిపోతుంది.

రమేష్: ఏమీ లింక్ అదేమి వద్దు పెట్టేయ్యండి.

ఇలా ఫోన్ పెట్టేసిన తరువాత పది సార్లు వివరాలు చెప్పాలని అడుగుతారు. ఏమైనా ఖర్మకాలి వారు పంపిన లింక్ క్లిక్ చేసినా, లేదంటే ఓటీపీ చెప్పినా మీ ఖాతాలోని సొమ్ములు ఖాళీఅవుతాయి. అవేమి చెప్పకుండా అప్రమత్తంగా ఉన్నవారికీ మరో రకమైన టార్చర్ మొదలవుతుంది. ఇదేలా అంటే...

రోజుకో కొత్త పంథా

సైబర్ నేరగాళ్ళ టార్చర్ మామూలుగా ఉండదు. ఈకేవైసీ అంటారు. మేము పంపే లింక్‌ను ఓపెన్ చేసి ఈకేవైసీ పూర్తి చేయండి లేకుంటే మరో గంటలో మీ ఫోన్ కట్ అవుతుంది. నెంబర్ బ్లాక్ చేస్తాం అంటూ వాయిస్ కాల్ వస్తుంది. ఈ తరహా కాల్స్ దాదాపుగా సెల్‌ఫోన్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి వస్తుంటుంది. ఎవరైనా ఈ కాల్స్‌కు స్పందించి వారు పంపిన లింక్‌లు నొక్కితే బ్యాంకుల్లో డబ్బు కొట్టేస్తారు. ఇలా రోజుకో కొత్త పంథాతో సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారు. వీరిని ట్రేస్ చేసి పోలీసులు కొంత మందిని పట్టుకుంటున్నా... పోలీసులకు దొరకని వారు చాలా మంది ఉంటున్నారు. చాలా తెలివిగా ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తూ సైబర్ నేరగాళ్ళు రెచ్చిపోతున్నారు.

కాల్ సెంటర్: సార్ క్రెడిట్ కార్డు ఆఫర్ ఉంది.

రమేష్ : మాకెలాంటి కార్డు వద్దంటూ పెద్దగా మాట్లాడితే అంతే మొదలవుతుంది టార్చర్.

కాల్ సెంటర్: ఎంటి అరుస్తున్నారు. మీ ఊరిలో సుబ్బారావు మీ పేరుతో లోన్ తీసుకున్నారు. మీ ఆధార్ కార్డు, పాన్ కార్డు అన్ని వివరాలు మాకు ఇచ్చాడు. ఇప్పుడు అతను లోన్ చెల్లించడంలేదు. వెంటనే మీరు కట్టాలి. అంటూ టార్చర్ చేస్తారు. ఇంకా గట్టిగా మాట్లాడితే మా బ్యాంకుకు రండి లేదంటే మీపై కేసు పెడతాం అంటూ బెదిరింపు. ఇదెక్కడి గోల, ఆ లోన్ ఏంటని అడిగితే ఈఎంఐ చెల్లించాలంటూ మన దగ్గర సొమ్ములు లాగేస్తారు. కాదని మొండికేస్తే వందల కొద్ది కాల్స్‌తో మనశాంతి లేకుండా చేస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

50 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి స్వాధీనం


విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ యాదగిరి

నరసాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో రెండేళ్లగా చోరీలకు పాల్పడుతున్న కె.అరుణ్‌కుమార్, ఎం.రాజ్‌కుమార్‌లను ఆదివారం వల పన్ని పట్టుకున్నారు. వీరి వద్ద 50 గ్రాముల బంగారు, 150 గ్రాముల వెండి, ఐదు వేలు నగదు, ఒక ల్యాప్ టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. ఆదివారం రాత్రి టౌన్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని దేశబత్తుల విజయజ్యోతి నివాసంలో గత ఏడాది తాళం తలుపులు ప్రార్థనా మందిరానికి వెళ్లిందన్నారు. ఇంటికి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు చోరికి గురయ్యారన్నారు. ఇదే నెలలో కటకంశెట్టి వేణుగోపాల్ ఇంటికి తాళం వేసి భీమవరం అస్పత్రికి వెళ్లి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు చోరీ చేసినట్టు ఫిర్యాదు అందాయన్నారు. మొగల్తూరు మండలం రామన్నపాలెంకు చెందిన కె.అప్పారావు తన కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లాడ న్నారు. తిరిగి ఇంటికి వచ్చిచూస్తే ఇంటి తాళాలు పగల గొట్టి ఎల్ఈడీ టీవీ, వెండి వస్తువులు పోయినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. నమోదైన కేసులపై దృష్టి పెట్టగా కాకినాడకు చెందిన అరుణ్‌కుమార్, మట్టపర్తి రాజుకుమార్ చోరీలు చేస్తున్నట్లు తేలిందన్నారు. వీరిపై నిఘా పెట్టగా శనివారం పట్టణంలోని మార్కెట్‌లో సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం అందటంతో వీరిద్దరిని అరెస్టు చేశామన్నారు. గతంలో వీరిద్దరిపై మొగల్తూరు, కాకినాడ, నిడమర్రు, తూర్పు గోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పదికిపైగా కేసులు ఉన్నాయన్నారు. రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సైలు జి.వాసు, జయలక్ష్మి పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన వ్యాన్

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వ్యాన్ టైర్ పంక్చరై రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లడంతో ఆరుగురు వ్యక్తులకు గాయాలైనట్టు కొవ్వూరురూరల్ హెచ్‌సీ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు. టి.నర్సాపురం మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన 9 మంది వాడపల్లి వెంకటేశ్వరస్వామి గుడికి బయలుదేరారు. కొవ్వూరు మండలం కాపవరం హైవేలో ఫ్లైఓవర్‌పై వ్యాన్ టైరు పంక్చరై రోడ్డు పక్కన కాలువలోకి పడింది. వ్యాన్ గ్లాస్ పగిలి ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మేరువ లీలా కుమారి, అడపా లావణ్య, డ్రైవర్ జవ్వా నాగేశ్వరరావుతో పాటు మరో ముగ్గురికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లీలాకుమారికి పక్కటెముకలపై గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసినట్టు రూరల్ హెచ్‌సి ఆర్. భగవాన్‌దాస్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

చించినాడ బ్రిడ్జిపై యువకుడి మోటారు సైకిల్

యలమంచిలి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం జొన్నలపాలెం గ్రామానికి చెందిన మెతుకుమెల్లి నాగవెంకట సతీశ్ (33) శనివారం నుంచి కనిపించకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మెతుకుమెల్లి నాగవెంకటసతీశ్ వర్క్ ఫ్రం హోంగా ఇంటివద్ద నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసి వస్తానని శనివారం ఇంటివద్ద చెప్పి వెళ్లిన సతీశ్ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల ఆరాతీసినా సతీశ్ ఆచూకీ లభించలేదు. సతీశ్‌కు చెందిన మోటారుసైకిల్ చించినాడ బ్రిడ్జిపై ఉందన్న సమాచారం ఆదివారం మధ్యాహ్నం అతని కుటుంబసభ్యులకు తెలిసింది. బ్రిడ్జివద్దకు చేరుకున్న సతీశ్ కుటుంబసభ్యులు మోటారు సైకిల్ సతీశ్‌దేనని నిర్ధారించుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శోభనాద్రిపురం గ్రామానికి చెందిన చంద్రు సుబ్బారావు దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల 22 రాత్రి భోజనం అయిన తరువాత అందరూ నిద్రించారన్నారు. తెల్లవారు జామున భర్త సుబ్బారావు లేచి చూడ గా తన భార్య కనపడలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదులో గ్రామానికి చెందిన మందల కృష్ణ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు వద్ద తనిఖీలు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీశ్ తెలిపారు. వాహనంలోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని వాహన యజమాని, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రోజు ఐదు చోట్ల దొంగతనాలు

నిత్యం జనసంచారం ఉండే ప్రదేశాల్లో చోరీలు

వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీమ్


ఫొటో స్టూడియోలో టార్చ్‌లైట్ వేసుకొని సొరుగులు చూస్తున్న దొంగ

ఆకివీడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకేరోజు ఐదు చోట్ల దొంగతనాలు చేశారు. నిత్యం జనసంచారం ఉండే ప్రాంతాల్లో దొంగలు తాళాలు పగలుకొట్టి దొంగతనాలు చేయడంతో వర్తకులు, ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు. రెండుచోట్ల వేర్వేరు దొంగలు దొంగతనం చేయడం, ఇద్దరు మోటారు సైకిల్‌పై, ఒకరు కాలినడకన తిరగడం సీసీ కెమెరాల్లో కనబడుతున్నాయి. స్థానిక దొరగారిచెరువు నుంచి సిద్ధాపురం వైపు వెళ్ళు రైల్వేగేటు రోడ్డులోను, వెలంపేట నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్ళే రహదారిలో దొంగతనాలు చేయడంతో జనం ఉలిక్కిపడ్డారు. ఈరెండు ప్రాంతాలలో ప్రయాణికులు, వర్తకులు, స్థానికులు తిరుగుతూనే ఉంటారు. సిద్ధాపురం రోడ్‌లో దేవి లక్ష్మీ కిరాణా, అంజి ఫొటోస్టూడియో, ఫస్ట్ ఎయిడ్ సర్వీస్-మందుల షాపుల తాళాలు పగలుకొట్టారు. ఫొటో స్టూడియోలో సుమారు రూ.లక్ష విలువచేసే కెమెరా, హార్డ్‌డిస్క్ దొంగిలించారు. మిగిలిన రెండుచోట్ల చిల్లర దొంగిలించారు. వెలంపేట నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్ళే దారిలో శ్రీనివాసా రైస్ ఎంటర్ ప్రైజెస్, స్రవంతి కిరణా మర్చంట్ తాళాలు పగలుకొట్టి చిల్లరు పట్టుకెళ్ళారు. దుకాణ వర్తకులకు తాళాలు పగలుకొట్టి ఉన్నాయని సమాచారం రావడంతో వచ్చి పరిశీలించారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు పోలీసులు వచ్చి సీసీ కెమెరాలు ప రిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు.పెద్దగా చోరీకి గురికాకపోవడంతో ఫిర్యాదులు చేయలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

చెరువులో పడి బాలుడి గల్లంతు

దెందులూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి బాలుడు గల్లంతయ్యాడు. సీతంపేట గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో గ్రామం మధ్యలో ఉన్న నాగుల చెరువు సమీపంలో ఆడుకుంటుండగా సీతం పేట గ్రామానికి చెందిన గుజ్జుల నాగరాజు చిన్న కుమారుడు శివశంకర్ (9) అదుపు తప్పి చెరువులో పడ్డాడు. గ్రామస్థులు, తల్లిదండ్రులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటిగా ఉండటంతో బాలుడు ఆచూకి దొరకలేదు. సోమవారం ఉదయం ప్రత్యేక బలగాలతో చెరువులో గాలింపు చర్యలు ప్రారంభిస్తామని ఎస్ఐ శివాజీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జడ్పీటీసీకి గాయాలు



ద్వారకాతిరుమల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల జడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సొంత కారు నడుపుకుంటూ వెళుతున్న ఆయన సీట్ బెల్ట్ పెట్టుకున్న కారణంగా స్వల్పగాయాలతో బయట పడ్డారు. వెంకట్రామన్నగూడెం సమీపంలోని ఓ గ్రామంలో జరుగుతున్న విందుకు హాజరయ్యేందుకు గాను తన ఇద్దరు స్నేహితులతో కలసి వెళ్తున్నారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం దాటిన తర్వాత ఎదురుగా వేగంగా వస్తున్న టాటా ఏస్ వ్యాను ఈయన కారును ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయా లతో బయటపడ్డారు.

వేర్వేరు చోట్ల ఎక్సైజ్ దాడులు

బెల్ట్‌షాపు నిర్వాహకుల అరెస్టు

పెనుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మణికంత రెడ్డి తెలిపారు. ఆదివారం పెనుగొండ మండలం దేవ గ్రామంలో జరిపిన దాడుల్లో మామిడిశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లిలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఆ వ్యక్తి నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ దాడిలో ఎస్సైలు మురళిమోహన్, దొరబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: పూలపల్లిలో బెల్ట్ షాపు నిర్వాహకుడు జి.సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, 9 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు జి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు పట్టణంలో బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించా రు. ఈదాడిలో ఒక వ్యక్తి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడిలో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తాం

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 24వ తేదీ శుక్రవారం రాత్రి ఏలూరు జిల్లా మండవల్లి మండలం శోభనాద్రిపురంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది గాయపడగా, అందులో ఏడుమందిని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. మిగిలిన వారు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

యథేచ్ఛగా మాంసం, చేపల విక్రయాలు



ద్వారకాతిరుమల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం నాడు ద్వారకాతిరుమలలో మాంసం, చేప్ప విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. సంతమార్కెట్‌లో బహిరంగంగా విక్రయాలు జరిగినా అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడలేదు. జెండా వందనం జరిగిన రోజున మాంసం, చేపలు విక్రయాలు జరుగకూడదని చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. యథేచ్ఛగా విక్రయాలు జరగడంతో మాంసం ప్రియులు వాటి కొనుగోలుకు ఎగబడ్డారు. కొందరు దుకాణదారులు షాపు వెనుక నుంచి విక్రయాలు జరిపారని స్థానికులు చెబుతున్నారు.

ఏపీ నిట్ వైపు వెళ్లే రహదారి ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. రహదారి మార్జిన్లు సరిగా లేకపోవడం, విద్యుత్ దీపాల నిర్వహణా లోపం, పెరిగిన రద్దీ వెరసి సమస్యల చిట్టాను ప్రదర్శిస్తోంది. ప్రధాన విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు ఈ రోడ్డులోనే ఉన్నాయి. దీంతో రద్దీ అంతకంతకూ పెరుగుతోంది. ఈ రద్దీకి అనుగుణంగా సౌకర్యాలను అదే తరహాలో ఏర్పాటు చేయాలంటూ ప్రజలు మునిసిపాల్టీ అధికారులను కోరుకుంటున్నారు. ఐదేళ్ల క్రితం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిరంజీవి పార్క్ నిర్వహణా లోపంపై సైతం పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వచ్చే వారికి పార్కును చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో 'ఆంధ్రజ్యోతి' ఓ ఆశా కిరణంలా సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేసేందుకు ముందుకు కదిలింది.. 'అక్షరం అండగా - పరిష్కారమే అజెండా' పేరుతో మీ ముందుకొస్తోంది..

- తాడేపల్లిగూడెం రూరల్/ పెంటపాడు

దారి చూపండి...



బెర్మ్ లేకుండా ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

సమస్యల చెరలో నిట్ వైపు వెళ్లే రహదారి - విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బందులు - పార్క్ పరిస్థితి అధ్వానం

మిణుకు మిణుకు మంటున్న విద్యుత్ దీపాలు...

తాడేపల్లిగూడెం బస్ కాంప్లెక్స్ వెనుక భాగం నుంచి ఏపీ నిట్ వైపు వెళ్లే రహదారికి సంబంధించిన వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న దీపాల నిర్వహణ సరిగా లేకపోవడంతో మిణుకు మిణుకు మంటున్నాయి. ఇదే రహదారిపై నిత్యం ప్రతి రోజూ వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇదే రోడ్డు మీదుగా నన్నయ్య పీజీ క్యాంపస్, శశి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యా సంస్థల బస్సులు పదుల సంఖ్యలో తిరుగుతుంటాయి. వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఇదే దారిన పట్టణానికి చేరుకునేందుకు ఇదొక ప్రధాన రహదారి.. ఈ రహదారికి ఆనుకునే ఎఫ్‌సీఐ కాలనీ, వీకర్స్ కాలనీ, గణేష్ నగర్, మిలటరీ కాలనీ, సిపాయి పేట, భూపాల్ నగర్ ప్రజలకు ఇదే రహదారి. ఇదిలా ఉంటే ఏపీ టిడ్కో, కేఎస్ఎన్ కాలనీ, ప్రభుత్వ కాలనీల్లో నివాసం ఉంటున్న వేలాది మంది ఈ దారినే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డు నుంచి ఏపీ నిట్, శశి, నన్నయ్య క్యాంపస్‌తో పాటు కేఎస్ఎన్ కాలనీ మీదుగా హైవేకి వెళ్లేలా సీసీ రోడ్డు వేస్తున్నారు. దీంతో ఈ దారి మరింత రద్దీగా మారే అవకాశం ఉంది. ఈ రోడ్డున విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి...

ఏపీ నిట్ రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డుకు ఆనుకుని ప్రముఖ వ్యాపార సంస్థలు చెన్నై షాపింగ్ మాల్, జీవీమాల్‌తో పాటు, విజేత సూపర్ మార్కెట్, ఫాస్ట్‌ఫుడ్, టిఫెన్స్ ఇలా అనేక వ్యాపార సముదాయాలు ఈ రోడ్డులోనే ఉన్నాయి. వ్యాపారం నిమిత్తం రాకపోకలు సాగించే వారితో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. అందుకే ఈ రోడ్డుపై ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంధకారంలో ఉన్న ఏపీ నిట్ రోడ్డు

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి..



గణేష్ నగర్‌కు వెళ్లే ఈ రోడ్డులో రాత్రిళ్లు విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. రాత్రిళ్లు ఈ రోడ్డు మీద వెళ్లాలంటేనే భయంగా ఉంటోంది. విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వెంటనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించి ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుకుంటున్నాం.

కలగర అప్పారావు, గణేష్ నగర్

పార్క్‌ను అభివృద్ధి చేయాలి..



ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో చిరంజీవి పార్క్‌ను నిర్మించారు. పిల్లలు, పెద్దలు ఆహ్లాదంగా గడిపేందుకు బాగుండేది. అయితే ప్రస్తుతం పార్క్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కనీసం పెరిగిన గడ్డి కూడా తొలగించడం లేదు. గత ఐదేళ్ల పాటు ఈ పార్క్ పూర్తిగా నిర్వీర్యమైంది. ఇప్పుడైనా పార్కును అభివృద్ధి చేయిస్తే మాకు ఉపయోగకరంగా ఉంటుంది.

పి.గంగయ్య, ఎఫ్‌సీఐ కాలనీ

బెర్మ్‌లు నిర్మించండి..



ఏపీ నిట్ వైపు వెళ్లే రోడ్డు చాలా ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డున రాకపోకలు సాగిస్తుంటాయి. కనీసం రోడ్డు పక్కన బెర్మ్‌లు కూడా ఉండకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారినపడి గాయపడే అవకాశం ఉంది. రోడ్డుపక్కన బెర్మ్‌లు నిర్మిస్తే ప్రమాదాలకు అవకాశం లేకుండా ఉంటుంది.

రంగనాథం సత్యనారాయణ, షాపింగ్ మాల్ ఉద్యోగి

బెర్మ్‌లు వేసి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



ఏపీ నిట్ వైపు వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద వ్యాపార సముదాయాలు, విద్యా సంస్థలతో పాటు నన్నయ్య పీజీ క్యాంపస్ కూడా ఉంది. అందుకే నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రతిష్ఠాత్మకంగా గణేష్ నగర్ నుంచి కేఎస్ఎన్ కాలనీ వరకు రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే వాహనాల రాకపోకలు మరింత పెరుగుతాయి. ఈ రోడ్డుకు బెర్మ్‌లు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదు.

పోతినీడి వెంకటేశ్వరరావు, సిపాయిపేట

చిరంజీవి పార్క్ నిర్వహణ అస్తవ్యస్తం...

ఏపీ నిట్‌కు వెళ్లే ఈ రోడ్డుకు ఆనుకుని ఎఫ్‌సీఐ కాలనీలోని చిరంజీవి పార్క్ గతంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. అయితే గత ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో పిచ్చి చెట్లు, కలుపు మొక్కలు లేచాయి. ఉన్న మొక్కలు చనిపోయి పచ్చదనం కనుమరుగైంది. గత టీడీపీ హయాంలోనే చిరంజీవి పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఈ ఐదేళ్లలో దానిని పట్టించుకోకపోవడంతో పార్క్ పరిస్థితి దయనీయంగా మారింది. సాయంత్రం వేళ ఉరుకులు పరుగుల ప్రపంచం నుంచి కొంత సేపు సేద తీరడం కోసం ప్రకృతి ఒడికి వెళ్లడానికి ఇబ్బందులు తప్పడం లేదు. పెరిగిన పిచ్చి మొక్కలు నిర్వహణ లేకపోవడంతో పట్టణ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ క్షణంలో ఎటునుంచి ఏ పాము వస్తుందేమోనని భయం, భయంగా పార్కులో గడపాల్సి వస్తోందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' మీ ముందుకు వస్తోంది. అక్షరం అండగా పరిష్కారమే అజెండగా ద్వారా ప్రభుత్వానికి అధికారులకు ప్రజలకు వారధిగా వ్యవహరిస్తోంది. సమస్యల పరిష్కారం దిశగా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తోంది..



28న తాడేపల్లిగూడెంలో వేదిక

తాడేపల్లిగూడెం గణేష్ నగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ఈ నెల 28న సాయంత్రం 3 గంటలకు సమావేశం నిర్వహించనున్నాం.. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ బి.ఏసురాజుతో పాటు అధికారులు హాజరుకానున్నారు. స్థానిక ప్రజలు, ఈ రోడ్డున వీధిలైట్లు సమస్య, రోడ్డు పక్కన పడిన ఎడ్లు, పార్క్ తదితర సమస్యలు అధికారులకు 'ఆంధ్రజ్యోతి' సమక్షంలో నివేదించే అవకాశం ఉంది. ఈ సమాశానికి పట్టణ ప్రజలు, విద్యార్థులు హాజరై సమస్యలను తెలపగలరు. ప్రజలు తరలివచ్చి సమస్యలను తెలియజేస్తే పరిష్కార మార్గాలపై చర్చించే అవకాశం ఉంటుంది.



పార్కులో వాకింగ్ చేస్తూ సేదతీరుతున్న మహిళలు


చిరంజీవి పార్క్ ముఖ ద్వారం



23కె రన్‌లో బొమ్మిడి, షరీఫ్, పొత్తూరి, డీఎస్పీ తదితరులు

సమాజంలో స్త్రీ పాత్ర వెలకట్టలేనిది

నరసాపురం టౌన్, జనవరి 26(ఆన్‌లైన్) : సమాజంలో స్త్రీ పాత్ర వెలకట్టలేనిదని, మహిళలు విద్యావంతులైనప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలో 'బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మిషన్ హైస్కూల్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో నాయకర్, ప్రభుత్వ మైనార్టీ సెల్ సలహాదారు ఎంఏ షరీఫ్, ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద మాట్లాడారు. టీడీపీ, బీజేపీ ఇన్‌ఛార్జీలు పొత్తూరి రామరాజు, మేకల సతీష్, చాగంటి చిన్నా, డాక్టర్ రాజ్యలక్ష్మి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ, సీతామహాలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెన్మెత్స రామభద్రరాజు

ఏప్రిల్ లోగా దాళ్వాసాగు పూర్తి చేయాలి

పోడూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులతో పాటు ఇరిగేషన్ పనులు చేపట్టే క్రమంలో ఏప్రిల్‌లో కాల్వలు కట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈలోగా రైతులు దాళ్వాసాగు పూర్తి చేయాలని పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు కోరారు. జిన్నూరు సొసైటీలో పాలకొల్లు డీసీ వైస్ చైర్మన్, మట్టపర్రు నీటి సంఘం అధ్యక్షుడు దేవళ్ల శ్రీరామకోటి మోహన్ అధ్యక్షతన జరిగిన రైతుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దాళ్వాసాగులో నీటి ఎద్దడి రాకుండా ఇరిగేషన్ శాఖ ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కూడా సహకరించాలన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్ మాట్లాడుతూ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ శాఖకు మంత్రి కావడం నీటిసంఘాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమన్నారు. పాలకొల్లు ఇరిగేషన్ శాఖ డీఈ వెంకట నారాయణ రైతులను సాగునీటి సమస్యలను అడిగి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, మట్టపర్రు నీటి సంఘం వైస్ చైర్మన్ పోతంశెట్టి కృష్ణారెడ్డి, మేడపాటి గంగాధరరెడ్డి, ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, తదితరులు



పెంటపాడులో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి



తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన ఆరిమిల్లి



ఆచంట ఎంపీడీవో కార్యాలయం వద్ద రిపబ్లిక్ డే వేడుకల్లో ఎంపీడీవో, ఎంపీపీ, కూటమి సభ్యులు

ఘనంగా గణతంత్ర వేడుకలు


పాలకొల్లు అర్బన్/టౌన్/పాలకొల్లు రూరల్/యలమంచిలి : పాలకొల్లు పట్టణంలో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పోలీసు గౌరవ వందనం స్వీకరించి, అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. ప్రెస్ క్లబ్ వద్ద మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ జెండా స్తూపాన్ని ఆవిష్కరించి, జెండాను ఆవిష్కరించారు. పాలకొల్లు ఎంపీ డీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఉమామ హేశ్వరరావు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ దుర్గాకిషోర్ జాతీయ పతాకా లను ఎగురవేశారు. యలమంచిలి రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ జి.పవన్‌కు మార్ జెండా ఆవిష్కరించారు.

- భీమవరంటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కుల, మతాలకు అతీతంగా జరుపుకునే అతిపెద్ద జాతీయ పండుగ గణతంత్ర దినోత్సవం అని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. 76వ గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. డీఆర్‌వో మొగిలి వెంకటేశ్వర్లు, డీపీఆర్‌వో టి.నాగేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. భీమవరం మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలోనూ ఎమ్మెల్యే అంజిబాబు జెండా ఆవిష్కరించారు. తొలుత గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు.
- నరసాపురం టౌన్/ మొగల్తూరు, జనవ రి 26 (ఆంధ్రజ్యోతి) : నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీవేద, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ అంజయ్య, ట్రాన్స్‌కోలో ఈఈ మధుకుమార్, తదితర కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగుర వేశారు. మొగల్తూరు రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ రాజ్ జెండా ఎగురవేశారు.
- తణుకు/తణుకు రూరల్/అత్తిలి/ ఇరగవరం : తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద జాతీ జెండాను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి, మాంటిస్సోరి స్కూల్‌లో డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. తణుకు సురాజ్య భవనంలో శ్రమజీవుల ప్రజా రిపబ్లిక్ సభలో ప్రజా రిపబ్లిక్ ఉద్యమాన్ని మరింత విస్తృత పరిచి కొనసాగించాలని రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ పిలుపునిచ్చారు. తణుకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో లోహిత్ జయసాగర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అత్తిలి మండలం అత్తిలి చాంబర్ కామర్స్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, అత్తిలి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పి శ్యామ్యూల్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
- తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, : తాడేపల్లిగూడెం పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద, మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, అలంపురం టీటీఆర్ సైనిక్ స్కూల్‌లో చైర్మన్ తనుబుద్ది

వాడవాడలా జెండా ఆవిష్కరణలు

భోగేశ్వరరావు, టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాడేపల్లిగూడెం మండలం మిలటరి మాధవరంలో మాజీ సైనికోద్యోగుల ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

- గణపవరం : గణపవరంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపల్ మధురాజు చేతుల మీదుగా పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గణపవరంలో పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మణికుమార్, సిబ్బంది జాతీయ జెండాకు వందనం చేసి స్వీట్లు పంచారు.
- ఆకివీడు/ఉండి : ఆకివీడు మండల ప్రజా పరిషత్ ప్రాంగణంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీకర్ తదితరులు జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్, నగ ర పంచాయతీ, తహసీల్దార్, విద్యుత్, సా మాజిక ఆరోగ్య కేంద్రం, యూపీహెచ్‌సీ, తదితర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల లు, కళాశాలలు, టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ కార్యాలయాల్లో జెండాను ఆవిష్కరించారు. ఉండి మండలం ఉండి సెంటర్‌లో జాతీయ నాయకులు విగ్రహాల వద్ద మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ గోపాలకృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.
- ఆచంట/పోడూరు/పెనుగొండ : ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కనకరాజు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ కె.వెంకట రమణ, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో పూర్ణబాబ్జి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ కె. వెంకటపతిరాజు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో బి.మంగా కుమారి, పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అనిత కుమారి, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ నాగరాజు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సూర్యనారాయణ, పెనుగొండ పంచాయతీల వద్ద సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి జాతీయ జెండాలను ఆవిష్కరించారు.ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అటానమస్ ఎన్ఎస్ఎస్ ఎన్‌సీసీ క్రీడా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



తణుకులో మాట్లాడుతున్న రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ

పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి

నరసాపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణం నుంచి మొదలైన ర్యాలీ కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి మీదుగా సాగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, కార్యదర్శి ఎం. రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ సంస్థల పరమవుతున్నాయన్నారు. ప్రజలపై పన్నుల భారం తగ్గించి కార్పొరేట్ సంస్థల ప్రాధాన్యత తగ్గించాలన్నారు. ఎం.త్రిమూర్తులు, టి.సత్యనారాయణ, కె.బాలరాజు, శ్రీరామచంద్రుడు, చినమిల్లి వీరబాబు, ఎంజనీలకంఠం, కామేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి) :కేన్సర్‌పై అవగాహన ఎంతో అవసరమని, ముందుగానే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స అందించవచ్చని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. భీమవరం ఆనంద పంక్షన్ హాల్లో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం, ఉచిత చర్మ సంబంధిత వ్యాధుల శిబిరాలను ఆదివా రం ఆయన ప్రారంభించారు. ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అల్లూరి వంశీ కృష్ణ, చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడుతూ క్యాన్సర్‌పై మహిళల్లో మరింత అవగాహన అవసరమన్నారు. డీటీడీసీ బాబు మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్స్ (విజయవాడ) క్యాన్సర్ ఫౌండేషన్ తమ మొబైల్ యూనిట్‌తో సుమారు 1600 మందికి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. పొత్తూరి బాపిరాజు, యర్రంశెట్టి శివకృష్ణ, కారుమూరి సత్యనారాయణమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.



పూర్ణచంద్రరావును సత్కరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

కూటమితోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

పాలకొల్లు అర్బన్, జనవరి, 26 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నిరుద్యోగ యువత ఇష్టపడి చదివి డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను సాధించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో ఆయన తన తండ్రి పేరుతో నెలకొల్పిన ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా అధ్యాపకుడిగా పదేళ్ల పనిచేశానని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు అవనిగడ్డకు చెందిన ప్రగతి కోచింగ్ సెంటర్ నుంచి నిపుణులైన ఫ్యాకల్టీలు వచ్చి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ చైర్మన్ పూర్ణచంద్రరావును శాలువాతో సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎస్.నాగలింగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సురక్షిత ఆహారమే లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి) హోటల్స్‌లో, స్వీట్స్ షాపుల్లో, బజ్జీల షాపుల్లో అన్ని ఫుడ్ షాపుల్లో సురక్షిత ఆహారం ప్రజలకు అందించాలని హోటల్స్ సంఘ యునియన్ గౌరవాధ్యక్షుడు షైబోయిన రఘు సూచించారు. తాడేపల్లిగూడెంలో సెలక్షన్ గ్రాండ్‌లో తాడేపల్లిగూడెం హోటల్స్ యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోటల్స్‌లో తీసుకోవాల్సిన సేఫ్టీ ప్రభుత్వ నిబంధనలు పాటించేలా సూచించారు. సంఘ అధ్యక్షుడు వేగి శ్రీనివాస్, ఆకుల నాగు, ఆకుల రామకృష్ణ, ఎం.చైతన్య, ఎస్‌కే ఇబ్బు, యెగ్గిన రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆక్రమణల తొలగింపు

కాళ్ళ జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కోమటిగుంటలో పరిశుభ్రతకు, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించడం అభినందనీయమని గ్రామ సర్పంచి బోణం భాగ్యశ్రీ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా ఇల్లు ఖాళీ చేసిన అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.